కథా నిలయం
1473
శ్రీకాకుళం

# పట్టం

పొలిటీషియన్స్‌కి పోలీసోళ్ళకి అవినాభావ సంబంధం వుంది. పోలీసోళ్ళ రక్షణ పొలిటీషియన్లకు.... పొలిటీషియన్ల అండదండ పోలీసువర్గానికి అవసరం. రాజకీయాల్లోకి ప్రవేశించాలీ అంటే... రౌడీయిజం... గూండాయిజం చేతనైవుండాలి! పార్టీ టిక్కెట్టు దొరికి ఎన్నికల్లో గెల్చి మంత్రిపదవి అలకరించగానే మొదలౌతుంది పోలీసువారిచ్చే రక్షణ!

ఇకపోతే ... పోలీసువారు నిర్వహించే సత్కార్యాలన్నింటికీ రాజకీయ నాయకుల మద్దతు వుండనే వుంటుంది.

మర్డర్లు చేయించటంతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన రంగరాజు తన పాతికేళ్ళ అనుభవాన్ని రంగరించి చివరికి ఎలాగైతేనేం మంత్రిపదవి చేజిక్కించుకున్నాడు.

పార్టీలు ఫిరాయించాడు. రంగులు మార్చాడు. అష్టకష్టాలు పడ్డాడు. హోంమంత్రి అయ్యాడు.

పోలీసోళ్ళ పొడ రంగరాజుకి మొదట్నుంచీ పడదు. అందుక్కారణం తాను కొత్తగా రాజకీయాల్లో ప్రవేశించిన రోజుల్లో తనను లాఠీలతో కొట్టి జైల్లో తోసేరు. ఎన్నో విధాలుగా తనను అవమానించారు.

లాకప్ డెత్‌లు... మానభంగాలు... ఎన్‌కౌంటర్లు... మొదలైనవాటన్నింటికీ పోలీసువారే కారకులని రంగరాజు నమ్మకం.

అందుకే తాను మంత్రి అయ్యాక వాళ్ళ భరతం పట్టాలనుకున్నాడు.

మంత్రి పదవి చేజిక్కించుకున్న తర్వాత వారం తిరక్కముందే... వంద మంది అధికారులను ఇష్టంవచ్చిన చోటికి బదిలీ చేశాడు.

హోంమంత్రి అయ్యాక తాను పాల్గొన్న మొట్టమొదటి మీటింగులోనే పోలీసు వారి దురాగతాలను బహిరంగంగా దుయ్యబట్టాడు.

పోలీసు అధికారుల గుండెల్లోకి రైళ్ళు పరుగెత్తాయి. మంత్రిగారి చర్యకి 'గడగడ' వణికిపోయారు.

ఈ సమస్యను ఎలా పరిష్కరించటమాని అధికారవర్గంలో కలవరం మొదలైంది.

మంత్రివరేణ్యులను ప్రసన్నులను చేసుకోవటానికి మార్గాలు అన్వేషించారు.

రంగరాజుని మంచి చేసుకొని... వలపన్ని బుట్టలో వేసుకోలేకపోతే (అదే... లొంగదీసుకోకపోతే) తమ ఉనికికే ప్రమాదం వాటిల్లే అవకాశం వుందని భావించారు.

పెద్దతలకాయలన్నీ ఒకచోట గుమిగూడి రహస్య సమాలోచన్లు చేశారు. ప్లాన్లు వేశారు. చివరకు... 'ధనమూలం ఇదం జగత్' అనే పాల్యూషనుకొచ్చారు.

దాడులు మొదలుపెట్టారు. దుండగులను పట్టుకున్నారు. బందిపోట్ల ముఠాలను మట్టుపెట్టారు. ఫుట్‌పాత్‌ల మీద... పేవ్‌మెంట్లమీద... నాలుగు రోడ్ల కూడలిలోనూ రూల్సుకి వ్యతిరేకంగా వ్యాపారం సాగిస్తున్నవారిని వేధించారు.

తమ నిజాయితీని నిరూపించుకోవటానికి మరెన్నో మార్గాలు అన్వేషించారు.

ఇంకేముంది... నెల తిరక్కముందే డబ్బు సంచులతో పోలీస్టేషన్లు నిండిపోయినయ్.

వెంటనే ఐదు నక్షత్రాల హోటల్లో రంగరాజుకి సన్మానసభ ఏర్పాటుచేశారు.

మంత్రిగారి నడుము వంగిపోయేట్టు దండలు వేశారు. చుట్టూ చేరి చప్పట్లు కొట్టారు. పొగిడేరు. కాకా పట్టారు. బాకాలు వూదారు. హేపీగా నవ్వుకున్నారు. గుండెలమీద బరువు దిగిపోయినట్టు ఫీలయ్యారు.

పోలీసువారి చర్య రంగరాజుని ఆశ్చర్యంలో ముంచెత్తింది. 'ఔరా' అంటూ ముక్కుమీద వేలేసుకున్నాడు.

అదంతా చూస్తుంటే రంగరాజులో భయం మొదలైంది.

భయాన్నీ ఆందోళననూ దూరం చేసుకునేటందుకు ఆ రాత్రి తన బంగళాకొచ్చేక ఎ.సి. రూమ్‌లో కూర్చుని ఇంపోర్టెడ్ విస్కీ బాటిలు ఓపెన్ చేశాడు.

మెల్లగా పిల్లిలా గదిలోకొచ్చాడు రాజకీయ సలహాదారుడైన బావమరిది భజగోవిందం.

వచ్చీ రాగానే బావగారిముఖంలోకి చూశాడు. చేతిలో విస్కీతో నిండిన గ్లాసు. పెదాలమధ్య మూడైదుల సిగరెట్టు కన్పించగానే పరిస్థితి బోధపడ్డది భజగోవిందానికి.

చప్పుడు చెయ్యకుండా పక్కనే వున్న సోఫాలో చతికిలపడ్డాడు.

'బావగారేమిటో దీర్ఘాలోచన్లో పడ్డారు...'

'అవును బామ్మర్దీ!... మనస్సేమీ బాగెలేదు.'

'ఎందుకని?... మంత్రి పదవి వూడిపోయేట్టుందా ఏమిటి ఖర్మ?' కంగారుపడ్డాడు భజగోవిందం.

'ఛ! నోర్ముయ్!!'

'మరెందుకు బావా, నీ దిగులు? విషయమేమిటో చెప్పు... పరిష్కార మార్గం నేను ఆలోచిస్తాను...'

'పోలీసోళ్ళు... నాలుగు డబ్బు సంచుల్ని నాకు బహుమతిగా ఇచ్చారు. వాటిని స్వీకరించటమా, నిరాకరించటమా అని నా మనస్సెందుకో సంకోచిస్తున్నది.'

'ఎందుకని...?'

'కట్టుకున్న పెళ్ళాన్నయినా నమ్మచ్చేమో గానీ... పదవిలో వున్నా... పోలీసోళ్ళని మాత్రం నమ్మకూడదనిపిస్తోంది...' గ్లాసులో మిగిలిన ద్రవాన్ని గొంతులో కుమ్మరించుకున్నాడు రంగరాజు.

పెద్దపెట్టున నవ్వాడు భజగోవిందం.

'ముందు నవ్వాపు బామ్మర్దీ... కావలిస్తే నువ్వూ మందుకొట్టి నాకో వుపాయం చెప్పు.'

'నువ్వొఠి అమాయకుడివి బావా! ఎందుకంటావా? పాతికేళ్ళ రాజకీయాల్లో తిరిగి వందెకరాల మాగాణీ పొలం అమ్మేశావ్! మంత్రి పదవి చేజిక్కించుకోవటానికి మామిడి తోట అమ్మాల్సివచ్చింది...'

'అయితే...?' తిక్కరేగినట్లు ప్రశ్నించాడు రంగరాజు.

'నువ్వు ఖర్చు పెట్టినదానికి వందింతలు పదవిలో వుండగానే సంపాదించాలి! అయిదేళ్ళు అయిపోయాక నీ ముఖం చూసేవాళ్ళెవరూ వుండరు...'

'అందుకని?' మాట తడబడ్డది రంగరాజుకి. కిక్‌తో తల తిరిగిపోతోంది.

'అదేం ప్రశ్న బావా? రేపు నువ్వు ముఖ్యమంత్రి కావాలీ అంటే ఎం. ఎల్. ఏ.లను కొనగలగాలి! అందుకు నీకు బోలెడంత డబ్బు కావాలి!!..'

'బామ్మర్దీ! నీ బుర్ర అమోఘం.. నీ ఆలోచన దివ్యంగా వుంది..'

'బావా! నువ్వేం భయపడకు. డబ్బు సంచుల్ని జాగ్రత్తపరిచే బాధ్యత నాది! నువ్వు మాత్రం సంపాదించే పని ముమ్మరంచెయ్!'

'సెబాస్ బామ్మర్దీ! అందుకేగా నిన్ను నా పి.ఎ.గా పెట్టుకుంది!!... తాగు! పీకల దాకా తాగెయ్...'

బావ రంగారాజు... బావమరిది భజగోవిందం ఆ రాత్రంతా తాగటంలో మునిగిపోయారు.

★★ ★★ ★★

తమ అభ్యర్థన మన్నించి డబ్బు సంచులను అంగీకరించిన మంత్రిగారి సౌజన్యాన్ని వేనోళ్ళ కొనియాడారు పోలీసు అధికారులు. ఇక తమకేం భయం లేదనే నిర్ణయానికొచ్చారు.

పది రోజులు తిరక్కముందే రంగరాజు లంచగొండితనం గురించి వార్త దట్టమైన పొగమంచులాగ అల్లుకుపోయి అందరికీ తెల్సిపోయింది.

వ్యాపారస్థులంతా ఏకమై, వారి అసోసియేషన్ వారికి పోలీసు వేధింపు చర్యల గురించి విన్నవించుకున్నారు. దీనికితోడు అపోజిషన్ పార్టీవారికి మంచి ఛాన్సు దొరికి నట్టయింది.

ఓ శుభముహూర్తాన అంతా ఏకమై ముఖ్యమంత్రిగారి నివాసం చేరుకున్నారు.

తమకు జరిగిన ఘోరమైన అన్యాయం గురించి ముఖ్యమంత్రిగారికి చెప్పుకున్నారు. వినతిపత్రం సమర్పించుకున్నారు.

ముఖ్యమంత్రి నిజాయితీపరుడు కావటాన వినతిపత్రం చూడగానే నిప్పు తొక్కిన కోతయ్యాడు. పడగ విప్పిన పాములా బుసకొట్టాడు. కళ్ళు చింతనిప్పులైనయ్.

ముఖ్యమంత్రికి ముందు వెనకా ఎవ్వరూ లేరు. ఏకాకి బ్రతుకీడుస్తూ వద్దనుకుంటూనే రాజకీయాలవేపు ఆకర్షితుడయ్యాడు.

అనాథ శరణాలయంలో హైస్కూలు చదువు పూర్తి చేసుకుని స్కాలర్షిప్‌తో పట్టభద్రుడయ్యాడు.

కాలేజీ ఎన్నికల్లో పోటీచేసి యూనియన్ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

ఆ తర్వాత దేశాన్ని, ప్రజల్ని వుద్ధరించాలనుకున్నాడు.

ఊరూరా తిరిగి వుపన్యాసాలిచ్చాడు. లంచగొండితనాన్ని సమూలంగా నాశనం చేస్తానని శపథం చేశాడు. అవినీతిని అంతం చేస్తానని గొంతు చించుకున్నాడు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించగలనని వాగ్దానం చేశాడు. వరకట్న దురాచారాన్ని రూపుమాపుతానన్నాడు. బడుగువర్గాలవారి కోసం... అట్టడుగు ప్రజల ఉజ్వల భవిష్యత్ కోసం నిరంతరం పోరాడతానన్నాడు.

ఎన్నికల్లో పోటీచేసి గెల్చాడు. ఎంతోమంది మద్దతుతో చివరకి ముఖ్యమంత్రి కాగలిగేడు.

తీరా ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాతనే కష్టాలు మొదలైనయ్. తాను సర్వస్వతంత్రుడు కాదనే యదార్థం గ్రహించగలిగేడు. తాను చేసిన వాగ్దానాలకు కార్య రూపాన్ని ఇచ్చేటందుకు ఎన్నో రకాల ప్రతిఘటనలను ఎదుర్కోవాల్సివచ్చింది.

అప్పుడు చేసిన వాగ్దానాలు ఇప్పుడు రాజకీయాల సుడిగాలికి తట్టుకోలేక ఆరిపోతున్న (కాలిపోతున్న) కొవ్వొత్తుల్లా వున్నయ్.

తన పాలనలో అవినీతా? లంచగొండితనమా? అందునా హోంమంత్రి రంగరాజా ఇలాంటి నీచమైన చర్యకి పాల్పడ్డది...?!

నో! సబ్బు నురగలాగా... పాకెట్ పాలకుమల్లే తన పరిపాలన తెల్లగా వుండాలని ఆశించాడు.

ఆలోచనల్లనుండి తెప్పరిల్లుకున్న ముఖ్యమంత్రి ఎదురుగా వున్న సభ్యులనుద్దేశించి కాస్సేపు మాట్లాడి వాళ్ళను తృప్తిపరిచాడు. తక్షం చర్య తీసుకోగలనని హామీ ఇచ్చాడు. అవసరమైతే కమిటీని వేస్తానని ఆవేశంగా చెప్పాడు. వాళ్ళని పంపిచేశాడు.

రంగరాజు అవినీతికి పాల్పడ్డాడనే విషయం ముఖ్యమంత్రి మెదడుని పీడకలలా తొలిచివేస్తోంది. వెంటనే ఫోన్లో మాట్లాడాలనుకున్నాడు. కాదు... కడిగేయాలనుకున్నాడు.

కానీ... రంగరాజు ఘటికుడు! తప్పు వప్పుకోకపోగా ఎదురుతిరుగుతాడు. రాజకీయ దుమారం చెలరేగుతుంది.

అందుకే... ఈ కేసుని ఎ.సి.బి. వాళ్ళకి అప్పగించటం సముచితంగా తోచింది ముఖ్యమంత్రికి. వాళ్ళు వలపన్ని రంగరాజుని పట్టుకోకమానరు. అప్పుడు సమస్యకు పరిష్కారమార్గం దొరుకుతుంది.

★★ ★★ ★★

రంగరాజు ఆవులిస్తే పేగులు లెక్కెయగల దిట్ట!

ధబ్బు సంచుల విషయం ముఖ్యమంత్రి దృష్టికొచ్చిందనే విషయం పసిగట్టేడు.

తాను నిజాయితీకి మారుపేరని... కేవలం ప్రత్యర్థులు తనమీద బురద చల్లటానికే ఇలాంటి ప్రచారం మొదలెట్టారని, డబ్బు సంచుల విషయం తనకేమీ తెలీదని, తాను నిర్దోషి అని పేపరుకివ్వాలనుకున్నాడు.

వెంటనే పత్రికలవారిని ఆహ్వానించాడు. వాళ్ళని మందులో ముంచెత్తాడు. కళ్ళ నీళ్ళుపెట్టుకుని గద్గదస్వరంతో విషయం వారికి విన్నవించాడు.

విలేకరులు నిజమేనని నమ్మినా నమ్మకపోయినా 'అయ్యో పాపం' అన్నారు. ముక్కు మీద వేలేసుకున్నారు. రంగరాజు స్టేట్‌మెంట్‌ని పేపర్లో తాటికాయలంత అక్షరాల్తో ప్రచురించారు.

ఈ సంక్షోభం అంతటితో ఆగలేదు. రంగరాజు ఎత్తుగడలకు... పన్నుతున్న వలలధాటికీ ముఖ్యమంత్రి తట్టుకోలేకపోతున్నాడు.

ఈలోగా కొందరు మంత్రులు తమ పదవులకు రాజీనామాలు చేసి రంగరాజుకి తమ మద్దతు ప్రకటించారు.

ముఖ్యమంత్రిలో కంగారు మొదలైంది. పార్టీ మీటింగు ఏర్పాటు చేశాడు. ఇంకా ఎన్నో ప్రయత్నాలు చేశాడు.

తనకు మద్దతు కరువౌతోందని గ్రహించిన ముఖ్యమంత్రి, వంటరితనాన్ని భరించలేక... విపత్కర పరిస్థితికి తట్టుకోలేక... గురువుగారివద్దకు దవుడుతీశాడు.

ఆశ్రమంలో వంటరిగా ముక్కు మూసుకుని జపం చేసుకుంటున్న గురువుగారిముందు మోకరిల్లాడు. తన సమస్యకు పరిష్కార మార్గం చూపించమని అర్థించాడు.

తపోసమాధిలోంచి బైటపడ్డ గురువుగారు ముఖ్యమంత్రిని చూచి చెయ్యెత్తి ఆశీర్వదించారు. కొన్నాళ్లపాటు రాజకీయాలకు దూరంగా వుండిపొమ్మని సూచించారు. మూడోకంటికి తెలీకుండా హిమాలయాలకు పారిపొమ్మన్నారు.

గురువుగారి ఆదేశానుసారం తెల్లారేసరికి అదృశ్యమైనాడు ముఖ్యమంత్రి. దొరికిన అవకాశాన్ని చేజిక్కించుకోవాలనుకున్నాడు రంగరాజు.

ముఖ్యమంత్రిగారికోసం పోలిసుల గాలింపుచర్య మొదలైంది. వెతికి వెతికి వేసారిపోయిన పోలీసులు. ముఖ్యమంత్రిగారు విదేశాలు పారిపోయివుంటారనే వదంతిని పుట్టించారు. అవునని నమ్మేశారు పిచ్చి ప్రజలు. రాజకీయాల్లో పండిపోయిన రంగరాజు తెలివిగా ముఖ్యమంత్రి పదవిని సొంతం చేసుకున్నాడు.

ప్రజలు... ప్రజాప్రతినిధులు... పోలీసులు రంగరాజు తెలివికి సెభాష్ అనేసి మెచ్చుకున్నారు. అంతా ఏకమై, చికరికి అవినీతిని అందలం ఎక్కించి పట్టం కట్టారు!

---

★ *(2-9-1990 ఆంధ్రజ్యోతి ఆదివారం దినపత్రికలో ప్రచురితం)*